క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు


గణపర్తిలో మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

మునగపాక : ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపుల కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం గణపర్తిలో భక్తులు వేకువజామునే లేచి చన్నీటి స్నానమాచరించి గ్రామంలోని దేవాలయాలకు డప్పు వాయిద్యాల నడుమ భజనలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు.

గంగాలమ్మతల్లి గుడికి దాతల విరాళం


గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న సోమేశ్వరరావు దంపతులు

మునగపాక : మూలపేట గ్రామస్తుల ఆరాధ్య దైవమైన గంగాలమ్మతల్లి గుడి శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నారు. శనివారం మొల్లేటి సోమేశ్వరరావు-పార్వతి దంపతులు ఆలయానికి రూ.10,116 నగదును అందజేశారు.

తోటాడలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


తోటాడలో వైద్య శిబిరం

మునగపాక : తోటాడ డెయిరీఫారంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ప్రముఖ న్యూరాలజిస్టు సాయి సందీప్ ఈ శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి ప్రారంభించారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి కోటేశ్వరరావు, పార్టీ నాయకులు బుద్ద రమేష్‌నాయుడు, మహాలక్ష్మినాయుడు, పొలమరశెట్టి జగదీష్, వికాస తరంగిణి కన్వీనర్ సరిసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీరాముని అవతారంలో పాండురంగడు



పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీ రాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సావాల్లో భాగంగా, దశావతారాలు భాగంగా రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు యి.కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వల్లభ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు


శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి

రాంబిల్లి: దిమిలి గ్రామంలో మార్గశిర శనివారం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాస ఉత్సవాలు ఇక్కడ ఘనంగా జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి వార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు.

పండగలా పింఛన్ల పంపిణీ


రాజుకోడూరులో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ శంకర్రావు


చొడువాడలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ పండగలా సాగింది. రూ.3వేలు పింఛన్ అందజేసిన జగనన్నకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. రాజుకోడూరులో సర్పంచ్ ముత్తా శంకర్రావు, సచివాలయ కన్వీనర్ కరణం చిరంజీవి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రూ.3వేలు పింఛన్‌ను జగనన్న అందజేయడం అభినందనీయమన్నారు.

పింఛనుదారులకు అండగా ఉన్నారు..

కోటవురట్ల: పింఛనుదారులకు సీఎం జగన్ కొండంత అండగా ఉంటున్నారని, ఇచ్చిన మాట ప్రకారం పింఛను నగదును రూ.3 వేలకు పెంచుకుంటూ వచ్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో వైఎస్సార్ పింఛను కానుకను శనివారం పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 113 పింఛన్లు మంజూరు కాగా పలు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కె.వెంకటాపురంలో కొత్తగా మంజూరైన 18 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీటీసీ కాళ్ల రత్నం, మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని పాల్గొన్నారు. చొడువాడలో వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చేశారు. లబ్ధిదారులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ గోపాలకృష్ణ, పార్టీ నాయకుడు రమణ పాల్గొన్నారు.


మునగపాకలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీటీసీ గణేష్


నరేంద్రపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మునగపాక : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా పింఛన్ సొమ్ము రూ.3వేలకు పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు బోడకుర్తి గణేష్ పిలుపునిచ్చారు. మునగపాకలో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన పింఛను లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని, ప్రతి లబ్ధిదారు జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావాలని ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి శ్రీరామమూర్తి, వలంటీర్లు కొర్ని శివ అప్పలనాయుడు, మొల్లి పరదేశినాయుడు బీరా మాధవి పాల్గొన్నారు.

నరేంద్రపురంలో పింఛన్ల పంపిణీ

అచ్యుతాపురం : మండలంలోని నరేంద్రపురంలో శనివారం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు చేతుల మీదుగా రూ.3 వేలు పింఛను నగదు లబ్ధిదారులకు అందజేశారు.

ఒంపోలులో నూతన పింఛన్ల పంపిణీ

మునగపాక : ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామన్నారు. ఒంపోలు సచివాలయ ప్రాంగణంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను ఆయన శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీరామమూర్తి, జానకీరామ్, తాతారావు, రామునాయుడు, దొడ్డి చిన్న పాల్గొన్నారు.

ఘనంగా తోడపెద్దు సంబరం


తోడపెద్దుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో తోడపెద్దు సంబరం శనివారం ఘనంగా నిర్వహించారు. కొత్తగా తయారు చేసిన తోడపెద్దుకు ఆచారం ప్రకారం పసుపు, కుంకుమతో ఘనంగా పూజలు చేశారు. గ్రామంలో ఊరేగించి సంబరం చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేత కార్మికులకు యూనిట్లు పంపిణీ నేడు

నక్కపల్లి : చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం కింద పలు రకాల యూనిట్లు మంజూరు చేస్తోందని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు కృష్ణ తెలిపారు. ఈ యూనిట్లను ఆదివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. పాయకరావుపేట క్లస్టర్ పరిధిలో మొదటి విడతగా మంజూరైన ఈ యూనిట్ల వివరాలు తెలిపారు. 6 ఫ్రేమ్ మగ్గాలు (విలువ రూ.1.92 లక్షలు), 40 సోలార్ లైట్లు (రూ.6 లక్షలు), 21 మోటరైజ్డ్ జాకార్డ్ లిఫ్టింగ్ మెషీన్లు (రూ.3.78 లక్షలు), 20 వర్క్‌షెడ్లు (రూ.24 లక్షలు) లబ్ధిదారులకు పాయకరావుపేట చేనేత సహకార భవనంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు.

విజయవాడకు భవానీభక్తులు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం గంగపరదేశమ్మ ఆశ్రమంలో భవానీభక్తుల చండీయాగ దీక్షలు శనివారంతో ముగిశాయి. ఆశ్రమంలో దీక్షలు ముగిసిన భవానీభక్తులు ఇరుముడి ధరించి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో జరిగే చండీయాగ పూర్ణాహుతిలో పాల్గొనేందుకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరాం దంపతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య అక్షింతలు ఊరేగింపు


యలమంచిలిలో అయోధ్య రాముని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


రామాలయంలో శ్రీరాముని చిత్రపటంతో భక్తులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో శనివారం స్టేషన్‌రోడ్డు, తులసీనగర్, అయోధ్యాపురి కాలనీ పాత వీధుల్లో అయోధ్యరాముని అక్షింతలు భక్తులు భక్తిశ్రద్ధలతో ఇంటింటికి వెళ్లి అందజేశారు. శ్రీ సీతారామ లక్ష్మణ సమేత చిత్రపటంతో పట్టణంలో భజన కార్యక్రమం ద్వారా భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రచారం నిర్వహించారు. పట్టణంలో ప్రజలందరూ శ్రీరాముని ఆశీస్సులు పొందారు. అయోధ్య రామమందిరం విశిష్టతను తెలిపేలా కరపత్రాలు పంచారు.ఈ కార్యక్రమంలో పట్టణంలో మహిళలు,చిన్నారులు పెద్దలు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ శ్రీ ప్రకాష్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ సైన్సెస్ డిగ్రీ కళాశాలకు నాక్ నేషనల్ అసిస్టెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ ఏ గ్రేడ్ లభించిందని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు తెలిపారు. కళాశాలలో ఉన్న అన్ని ప్రమాణాలను పరిగణనలోనికి నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ ఎన్ఎఎసి నిర్వహించిన కఠినమైన మూల్యాంకన ప్రక్రియను అనుసరించి, 3.11 సిజిపిఎతో జాతీయ స్థాయిలో ఏ గ్రేడ్ ఇవ్వడం జరిగిందని మన ప్రాంతంలో నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన ప్రథమ డిగ్రీ కళాశాల తమది అని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందిని, విద్యార్థులను ఆయన అభినందించారు.

సర్వేలో తప్పులుంటే ఫిర్యాదు చేయండి


మాట్లాడుతున్న తహసీల్దారు జయమ్మ

కోటవురట్ల: సమగ్ర భూ సర్వే రికార్డులలో తప్పులు, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని తహసీల్దారు జయమ్మ కోరారు. లింగాపురంలో సమగ్ర భూ సర్వేపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రుత్తల గోవిందు, కొరుప్రోలు రమణ, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరువీధి సేవ


స్వామివారిని తిరువీధి సేవలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం కొండపై మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉత్సవమూర్తులు, ఆండాళ్లమ్మవారికి ఉపాలయాల్లోను నిత్యార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను రాజాధి రాజవాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పెద్ద పల్లకిలో ఉంచి ఉపమాక మాడవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. ఆండాళ్లమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 22వపాశురం అంగన్ మాజల్తరసర్‌ను విన్నపం చేశారు. అనంతరం ప్రసాద వినియోగం తీర్థ గోష్టి నిర్వహించారు. డీఎల్‌పురం గ్రామానికి చెందిన భజన బృందం భజన గీతాలు ఆలపించారు.

ఎన్టీపీసీ మహిళా ఎగ్జిక్యూటివ్‌లకు అభినందన


మహిళా ఎగ్జిక్యూటివ్‌లను అభినందిస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో వార్షిక మరమ్మతుల అనంతరం విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించడం(సింక్రోనైజ్)లో విశేష కృషి చేసిన మహిళా ఎగ్జిక్యూటివ్‌లను శనివారం సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. వార్షిక మరమ్మతుల అనంతరం యూనిట్-1లో శుక్రవారం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మహిళా ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా యూనిట్‌ను (సింక్రోనైజ్) పునఃప్రారంభించడం ఎన్టీపీసీలో ఇది మొదటిసారని సిన్హా పేర్కొన్నారు. మహిళా సాధికారితలో ఇది ఓ భాగమన్నారు. కార్యక్రమంలో ఓ అండ్ ఎం జీఎం డి.పి. పాత్ర, ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాల్, జీఎం మాథ్యూ ఇకోవూరు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర గణపతి రామాలయం నిర్మాణం కోసం శనివారం స్థల పరిశీలన చేశారు. దేవదాయ శాఖ స్థలంలో ఆలయం నిర్మించాలని తలపెట్టారు. ఆలయ నిర్మాణం ఎపుడు చేపట్టాలనే విషయమై స్థానికులు సమావేశం నిర్వహించారు. కొమ్మాది అష్టలక్ష్మి అమ్మవారి ఆలయ అర్చకుడు చామర్తి శ్రీధర్ ఆచార్యులు, మునగపాక సీతారామ స్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త గోగుల సువర్ణకుమార్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు ఆలయ నిర్మాణంపై చర్చించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సరళ సత్యనారాయణ, ఎంపీటీసీలు రాము, గణేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

యలమంచిలి : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన ఎ.నాగరాజు పరిమితికి మించి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద పట్టణ పోలీసులు పట్టుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కోటవురట్ల : కొడవటిపూడిలో ఓ ఇంటిపై దాడి జరిపి అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బి.రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారంతో గ్రామానికి చెందిన కర్రి అమ్మాజీ ఇంట్లో నిలువ చేసిన 25 మద్యం సీసాలను పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితురాలు కర్రి అమ్మాజీపై గతంలో నాలుగు ఎక్సైజ్ కేసులు ఉన్నట్టు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3,610 ఉంటుందని తెలిపారు.

పాఠశాల భవనం కూల్చివేతపై ఫిర్యాదు


కూల్చివేతకు గురైన ప్రభుత్వ పాఠశాల భవనం

మునగపాక: గవర్ల అనకాపల్లిలో ప్రభుత్వ ఆస్తులను కూల్చివేసి నష్టపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలోని ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు గురైంది.అయితే ఎవరికీ ఎటువంటి సమాచారం లేకుండా, పంచాయతీ తీర్మానం లేకుండా కొంతమందితో కలిసి స్థానికంగా ఉంటున్న ఆళ్ల మహేశ్వరరావు పాఠశాల భవనాన్ని కూల్చి వేశారని సర్పంచ్ భర్త దొడ్డి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇస్మాయిల్, ఈశ్వరరావు, వార్డు సభ్యులు బుద్ద రవికుమార్, సత్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటింటికీ అయోధ్యరాముని అక్షింతలు


శ్రీరాముని అక్షింతలు పంచుతున్న భక్తులు

పాయకరావుపేట : శ్రీరాముని అక్షింతలు మండలంలో ఆయా గ్రామాల్లో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పంపిణీ చేస్తున్నట్టు సేవా ఫౌండేషన్ ప్రచార కర్త కట్టా వీరబాబు తెలిపారు. ఈ నెల 22 న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బాల రాముని పూజించిన అక్షింతలను అయోధ్య నుంచి గ్రామాగ్రామాన ప్రదర్శించారు. ఆయా దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు అనంతరం గ్రామాల్లో ప్రతి ఇంటింటికి భక్తులు తిరిగి అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అరట్లకోట గ్రామంలో పాయకరావుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు దేవవరపు రాజేష్‌ఖన్నా, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సబ్ కమిటీ అధ్యక్షుడిగా ధర్మారావు


అభినంద సభలో ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : గ్రామీణ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఎన్నిక కావడం అభినందనీయమని ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి సునీల్ అన్నారు. ఏపీటీఎఫ్ సబ్ కమిటీ అధ్యక్షునిగా ఎంపికైన కర్రి ధర్మారావుని శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ అభినందన సభలో ధర్మారావు మాట్లాడుతూ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతామని, ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండేలా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎస్.వెంకట సూర్యనారాయణ, కె.వి.ఆర్, పి.అప్పారావు, కె.శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, జగన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై నివేదిక ఇవ్వండి

- రేవు పోలవరం పాఠశాల తనిఖీ చేసిన ఆర్‌జేడీ


రేవుపోలవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు పనులు వేగవంతం చేయాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి అన్నారు. రేవుపోలవరం ఉన్నత పాఠశాలను శనివారం ఆర్‌జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ట్యాబులు వినియోగం, విద్యా బోధనపై ఆరా తీశారు. అనంతరం ప్రారంభంలో నిలిచిపోయిన నాడు-నేడు పాఠశాల భవనం పనులు పరిశీలించారు. జిల్లా అత్యధికంగా రూ.3 కోట్లు కేటాయిస్తే అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పనులు ఏ కారణం చేత నిలిచిపోయినది వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న ఆర్‌జేడీతో మాట్లాడుతూ భవనం నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించగా, ఎమ్మెల్యేతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామని, సుమారు లక్షా 50 వేల రూపాయలు ఖర్చు చేస్తుండగా ఎదురుగా ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారు వచ్చి పనులు అడ్డుకున్నారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు చొరవ తీసుకుని, పోలీస్ ప్రొటక్షన్ ఇచ్చి పనులు చేసేందుకు సహకరించలేదన్నారు. దీనిపై నివేదిక తనకు ఇవ్వాలని, జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పనులు చేపట్టేలా చేస్తామని ఆర్‌జేడీ అన్నారు. ఎంఈవో మూర్తి, సర్పంచ్ మల్లే లోవరాజు పాల్గొన్నారు.

శ్రీరామ స్పర్శిత అక్షింతల ఊరేగింపు


అచ్యుతాపురంలో అక్షింతలు ఊరేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, రామన్నపాలెం, ఎర్రవరం గ్రామాల్లో శ్రీ రామ స్పర్శిత అక్షింతలు ఊరేగించారు. రామన్నపాలెంలో నిర్వహించిన ఊరేగింపులో ధర్మిరెడ్డి నాయుడు బాబు, సుబ్రమణ్యం, రాము,లాలం సత్తిబాబు,కొల్లి అప్పారావు,రమణ పాల్గొన్నారు. ఎర్రవరంలో గంగిరెడ్డి లక్ష్మీరాము, అగ్గాల హనుమంతరావు, సిరసపల్లి సత్యనారాయణ, అచ్యుతాపురంలో కూండ్రపు వెంకునాయుడు, ద్వారాపురెడ్డి బాబ్జి, చిరంజీవి,కూండ్రపు రమణ,కూనిసెట్టి రమణ, లాలం కృష్ణ, చింతకాయల రాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ వద్ద వృద్ధుల నిరసన


స్టేషన్ ముందు ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న వృద్ధులు


స్టేషన్ మేనేజర్‌కి వినతిపత్రం అందిస్తున్న వృద్ధులు, అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు శనివారం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ వృద్ధులకు రైల్వేటిక్కెట్లలో రాయితీ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. టిక్కెట్లలో రాయితీ కల్పించకపోవడంతో వృద్ధులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంతకుమందు స్టేషన్ మేనేజర్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్త, రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, వృద్ధులు కె.నారాయణరావు, వై.ఆదినారాయణ పాల్గొన్నారు.